రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 27, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్18, క్యాబేజీ 16, క్యారెట్ 40. దొండ 45, ఆలు 31, ఉల్లి 24, గోకర 40, దోస 23, సొర 11, పొట్ల 18, అరటి 9, చిక్కుడు 70, అర్వి 43, మునగ 45, చిలగడదుంప 55, బీట్‌రూట్ 19, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 165, కాప్సికమ్ 45. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. వినయ్‌నగర్ కాలనీ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెడ్డి కాలనీ, బాలాజీనగర్, కృష్ణానగర్, వినయ్‌నగర్, ఎస్‌జీఆర్ కాలనీల్లో, అదే విధంగా సాయిరాంనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు సాయిరాంనగర్, గ్రీన్‌పార్కు, శ్రీరాం నగర్, సాయితిరుమల, ఎస్‌వీఆర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింద తెలిపిన ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

ఉ.11 నుంచి మ. 12 గంటల వరకు...

ఎల్‌ఐసీ కాలనీ, న్యూ సైదాబాద్ పీఎస్, గ్రీన్‌ల్యాండ్ కాలనీ, ఫరా కాలనీ, ఎల్‌సీహెచ్ కాలనీ, వాటర్‌ట్యాంక్, పూసలబస్తీ, రెడ్డిబస్తీ పరిసర ప్రాంతాలు.

మ. ఒంటి గంట నుంచి 2 గంటల వరకు...

ఏకలవ్యనగర్, సైదాబాద్ మెయిన్‌రోడ్, పూసలబస్తీ, రెడ్డిబస్తీ పరిసర ప్రాంతాలు.

మ. 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు...

స్టాండ్లీ స్కూల్, దర్గా ఏ ఉజాలేషా, జీవన్‌జంగ్ కాలనీ, డీ క్వార్టర్స్ పరిసర ప్రాంతాలు.

పహాడీషరీఫ్: జల్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కొనసాగుతుందని పహాడీషరీఫ్ ఏఈ ఎల్‌వి సత్యనారాయణ తెలిపారు. శ్రీరాం కాలనీ, బృందావన్ కాలనీ, రిలయన్స్ కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, జల్‌పల్లి గ్రామం, బేవరేజెస్ వెంచర్, సాదత్‌నగర్, పటేల్ కాలనీ, బాలాజీ కాలనీ, వెంకటేశ్వర కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు కలిగే అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఇబ్రహీంపట్నం అటవీ శాఖ అధికారిపై ఫిర్యాదు

హస్తినాపురం: నాగార్జునసాగర్ రహదారికి ఇరువైపులా కాలనీల్లో ఉన్న పెద్ద పెద్ద చెట్లను నరికివేస్తున్నారని ఇబ్రహీంపట్నం అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సెంటర్ ఫర్ సోసియోకల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ సెక్రటరీ వి.సన్నీహెరాక్లియస్ ఆరోపించారు. ఈ విషయమై ఆర్‌టీఐ ద్వారా సమాచారం అడిగినందుకు ఇబ్రహీంపట్నం ఎఫ్ఆర్‌ఓ బెదిరించారని ఆరోపిస్తూ బుధవారం అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్, సమాచార కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. చెట్లను కాపాడాల్సిన ఇబ్రహీంపట్నం ఎఫ్ఆర్‌ఓ చెట్లు నరికే వారికి వంత పాడుతున్నారని, చట్టప్రకార చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరామన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యవర్గం



వనస్థలిపురం: డివిజన్‌లోని శ్రీనివాసపురం కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.అంజిరెడ్డి, ఎస్.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీరాములు నేత, సంయుక్త కార్యదర్శులుగా ఎం.గోవర్ధన్ నేత, ఎస్.నర్సింహారెడ్డి, కోశాధికారిగా జె.మురళీధర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.బాలచందర్, సలహాదారుగా ఆర్.మనోహర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ, సీనియర్ సిటిజెన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

భర్త ఇతరులతో గొడవపడుతున్నాడని.. మహిళ ఆత్మహత్య

నాగోలు: పాలను నిల్వ చేయడానికి ఉపయోగించే రసాయన ద్రవాన్ని తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మన్సూరాబాద్ శైలజాపురి కాలనీకి చెందిన బొల్లు మల్లేష్, మంజుల (37) భార్యాభర్తలు. మల్లేష్ స్థానికులతో బుధవారం చిన్న చిన్న విషయాలపై గొడవ పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. గొడవలతో మనస్తాపం చెందిన భార్య మంజుల ఇంట్లో ఉన్న పాలను నిల్వ చేసేందుకు వినియోగించే రసాయన ద్రవాన్ని తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయిందని తెలిపారు. మృతురాలి కుమార్తె సోనీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్పొరేటర్

నాగోలు: యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని, ఆపదలో ఉన్న వారికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అన్నారు. బుధవారం బీజేవైఎం నాయకులు ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో నాగోలు డివిజన్ బండ్లగూడలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపడవచ్చని, ఆసుపత్రుల్లో రక్త కొరతను కొంత మేర తగ్గించవచ్చన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కేసీ రెడ్డి పద్మారెడ్డి, రావుల శ్రీనివాస్‌గౌడ్, రాముగౌడ్ పాల్గొన్నారు.

కఠోర సాధనతో అంతర్జాతీయ స్థాయికి..

- ఏడేళ్ల వయసు నుంచే స్కేటింగ్‌లో శిక్షణ
- కోచ్ సూచనతో ఇన్‌లైన్ హాకీలో తర్ఫీదు
- వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైన టంగుటూరి నందిత



ఇన్‌లైన్‌హాకీ టీం ఇండియా జట్టు సభ్యులతో టంగుటూరి నందిత

మన్సూరాబాద్: స్కేటింగ్‌పై ఆసక్తితో ఏడేళ్ల వయసు నుంచే శిక్షణ ప్రారంభించింది.. క్రమశిక్షణ, పట్టుదలతో కఠోర సాధన చేసింది.. సబ్ జూనియర్ స్థాయి నుంచి విశేష ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి ఇన్‌లైన్ హాకీ పోటీల్లో పాల్గొని పతకాలు కైవసం చేసుకుంది. ఫలితంగా జాతీయ జట్టుకు ఎంపికై అంతర్జాతీయ స్థాయి పోటీల్లో భారత్ తరపున పాల్గొనే జట్టులో స్థానం సంపాదించింది మన్సూరాబాద్ జడ్జెస్ కాలనీకి చెందిన టంగుటూరి నందిత.

- స్కేటింగ్ శిక్షణ సమయంలో నందిత దూకుడు చూసి స్కూల్ కోచ్ అజయ్ ఇన్‌లైన్ హాకీపై సూచనలు, సలహాలు ఇచ్చాడు. అప్పటి నుంచి వెనుతిరిగి చూడకుండా పలు రాష్ట్రీ య, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక ప్రశంసలు పొందింది.
- తల్లిదండ్రులు టంగుటూరి నాగరాజు-రజనీలు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో గచ్చిబౌలి స్టేడియానికి నందితను తీసుకెళ్లి శిక్షణ ఇప్పించారు. 2017వ సంవత్సరంలో సబ్ జూనియర్ స్థాయి పోటీల నుంచీ ప్రతిభ కనబర్చిన నందిత నేడు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది.
- 2024లో ఇటలీలో నిర్వహించే ఇన్‌లైన్ హాకీ వరల్డ్‌కప్ పోటీలకు రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించిన మహిళల జట్టులో స్థానం దక్కించుకుంది.

పాల్గొన్న పోటీల వివరాలు:

- సబ్ జూనియర్ జాతీయ స్థాయిలో... 2017లో హర్యానా కురుక్షేత్ర, 2018, 2019 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో జరిగిన సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. తర్వాత 2020- చండీఘడ్, 2021లో మొహాలీలో జరిగిన పోటీల్లో పాల్గొంది. 2021 పంజాబ్‌లో డెల్‌పూర్‌ల్లో జరిగిన పోటీల్లో కాంస్యం సాధించింది.
- జూనియర్ జాతీయ స్థాయిలో... 2022- బెంగుళూర్, 2023 చండీఘడ్‌లో జరిగిన జాతీయ జూనియర్ బాలికల పోటీలు.
- రాష్ట్రస్థాయిలో.. 2017, 2018, 2019 సంవత్సరాల్లో రాష్ట్ర స్థాయి జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి గోల్డ్‌మెడల్ కైవసం చేసుకుంది.
- అంతర్జాతీయ స్థాయిలో.. 2023లో చైనాలో జరిగిన ఏసియన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని జట్టుకు కాంస్యం సాధించింది.
- 2024లో జాతీయ మహిళల జట్టుకు ఎంపికై అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే జట్టులో చోటు దక్కించుకుంది.

ఆనందంగా ఉంది..



ఇన్‌లైన్ హాకీ వరల్డ్‌కప్ పోటీల్లో పాల్గొనే జట్టులో స్థానం లభించడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల సహకారంతోనే ఇది సాధ్యమైంది. తెలంగాణ రాష్ట్రం నుంచి వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైన ఏకైక క్రీడాకారిణి నేనే కావడం గర్వంగా ఉంది.

– నందిత, క్రీడాకారిణి

ప్రభుత్వాల ప్రోత్సాహం అవసరం



ఇన్‌లైన్ హాకీ క్రీడను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. మన దేశ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి కోచ్‌లతో శిక్షణ ఇప్పించాలి. జాతీయ స్థాయి మహిళా జట్టు ఎంపికలో ఈ ఏడాది సుమారు 200 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు.

– సత్య, జాతీయస్థాయి కోచ్

ఇన్‌లైన్ హాకీపై పెరుగుతున్న ఆదరణ



చిన్నవయస్సులో శిక్షణ ఇస్తే ఇన్‌లైన్‌హాకీ క్రీడలో రాణిస్తారు. క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణ తీసుకోవాలి. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను ఆకళింపు చేసుకొని ఆ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి. రోజురోజుకూ ఇన్‌లైన్ హాకీ క్రీడపై ఆదరణ పెరుగుతోంది.

– శ్రీనివాస్, కోచ్

పైపులతో ఇంటి వాకిళ్లు, కార్లు కడిగితే 'కనెక్షన్' కట్!



పైపులతో వాకిళ్లు కడగ వద్దని చెప్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: ఇంటి ముందు పైపులు పెట్టి వాకిళ్ల, కార్లను కడుగుతూ రోడ్లపై విచ్చలవిడిగా నీళ్లు పోస్తున్న వారి ఇంటికి వాటర్ కనెక్షన్‌ను తొలగిస్తామని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. లింగోజిగూడ డివిజన్‌లోని బృందావన్, సాయిరాం నగర్ కాలనీల్లో బుధవారం ఉదయం ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ఇంటి ముందు పైపుల ద్వారా నీరును పడుతున్న వారితో మాట్లాడారు. ఇలా రోడ్లపై నీరుపోయడం వల్ల రోడ్డు బురదమయంగా మారి కాలినడకన వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డివిజన్ పరిధిలో ఎవరైనా ఇంటి ముందు పైప్‌తో వాకిళ్లను, కార్లను కడిగితే జీహెచ్‌ఎంసీ సిబ్బంది ద్వారా వారిని గుర్తించి ఇంటి నీటి కనెక్షన్లు తొలగిస్తామని అన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ యాదయ్య, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు

కుక్కలు బెడద లేకుండా చర్యలు...

కాలనీల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతుండటంతో ప్రజలు చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇక ముందు అలాంటి పరిస్థితులు లేకుండా డాగ్ క్యాచింగ్ సిబ్బందితో వాటిని పట్టిస్తున్నామని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో డాగ్ క్యాచింగ్ సిబ్బంది సహకారంతో కుక్కలను పట్టించామన్నారు. ఇక ముందు ఏ కాలనీలోనైనా రోడ్లపై ఎక్కువగా కుక్కలు తిరుగుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని ఎవరైనా తన దృష్టికి తెస్తే వెంటనే వాటిని డాగ్ క్యాచింగ్ సిబ్బందితో పట్టిస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

– కమిషనర్ చంద్రశేఖర్

మీర్‌పేట: రానున్న వర్షాకాలంలో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలు పరిష్కరించాలని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. బుధవారం కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. కాలనీల్లో, ప్రధాన రహదారుల్లో వర్షపునీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా మూతలు లేని మ్యాన్‌హోళ్లను గుర్తించి వెంటనే మూతలు ఏర్పాటు చేయాలన్నారు. శానిటరీ, ఇంజినీరింగ్ అధికారులు, రెస్పాన్స్‌టీం సభ్యులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, మేనేజర్ వెంకట్ రెడ్డి, ఆర్‌ఓ అంజన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం



మొయినాబాద్ రూరల్: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని పంచాయతీ కార్యదర్శి సంధ్య పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఆయా హోటల్స్, రోడ్ల ప్రక్కన చెత్తాచెదారం వేస్తే ఫెనాల్టీ తప్పదని పంచాయతీ కార్యదర్శి సంధ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గండిపేట చౌరస్తా మొదలుకొని హిమాయత్‌నగర్ వరకు ఆమె రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్తను పంచాయతీ సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోటల్ యజమానులు, వ్యాపారస్తులు పలువురు చెత్తను ప్లాస్టిక్ కవర్లల్లో తెచ్చి రోడ్డు ప్రక్కన వేయడం పరిసరాల పరిశుభ్రతకు విరుద్ధమని తెలిపారు. ఇలా వేస్తే సీసీ కెమెరాల ద్వారా పట్టుకొని ఫెనాల్టీ వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ప్రహరీ నిర్మాణం

- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సీపీఎం నేతల వినతి



అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలోని ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యాదయ్య.. కలెక్టర్ శశాంకకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్ మెట్‌లోని సర్వే నంబర్ 283(ప్రభుత్వ భూమి)లో 2005లో అప్పటి ప్రభుత్వం పీఓటీ కింద స్వాధీనం చేసుకుందని.. ఈ భూమిలో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ నిర్మించిందన్నారు. వీటితో పాటు ఇందిరమ్మ ఇళ్ల స్థలాల కోసం పది ఎకరాల్లో ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ నిర్మించిందన్నారు. అయితే ఇటీవల కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, స్థానిక నాయకులు కుమ్మక్కై ప్రభుత్వ భూమిలోని దాదాపు 25 ఎకరాలను ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని.. ప్రహరీ నిర్మాణం కూడా చేపడుతున్నారన్నారు. ఈ క్రమంలో పల్లె ప్రగతిలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రకృతివనంలోని మొక్కలను కూడా ధ్వంసం చేశారని ఆరోపించారు. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు.. తమకేమీ పట్టనంటు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని యాదయ్య కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు.. శివకుమార్, భిక్షపతి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం





ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వేడుకల్లో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లక్ష్మీనృసింహ స్వామి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని అన్నారు. పెద్ద చెరువు సుందరీకరణలో భాగంగా నృసింహస్వామి దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆలయ భూమి ఆక్రమణకు గురికాకుండా భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తానన్నారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జెడ్పీటీసీ భూపతిగాళ్ళ మహిపాల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించండి



హరిపురి కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఇటీవల కురిసిన వర్షాల వల్ల కాలనీల్లో ఏర్పడిన రోడ్డు గుంతలు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులకు సూచించారు. ఆర్‌కే పురం డివిజన్‌లోని హరిపురి కాలనీ, జనప్రియ గార్డెన్, సరోజినీ నగర్ కాలనీల్లో బుధవారం ఆమె పర్యటించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ, రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి రోడ్లు గుంతలు పడ్డాయని, డ్రైనేజీ పొంగిపొర్లి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటితో తమ కాలనీలోని ఇళ్లు మునిగిపోతున్నాయని కాలనీవాసులు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో మాట్లాడి కాలనీలోకి వర్షం నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ ఈశ్వర్, వాటర్ వార్క్స్ ఏఈ రామకృష్ణారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, సాజిద్, నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతా రెడ్డి, గొడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

మీర్‌పేట: చెరువు సుందరీకరణలో భాగంగా పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మీర్‌పేటలోని మంత్రాల చెరువును ఎమ్మెల్యే అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి రెండువైపులా చైన్‌లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. చెరువు వద్ద ఆకట్టుకునేలా జింకల విగ్రహాలు, నంది విగ్రహం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ–కామర్స్ వెబ్‌సైట్ డిజైన్ చేసిన విద్యార్థులు

'లెర్నోరమస్ టెక్ జనరేషన్' క్యాంప్‌లో విద్యార్థుల ప్రతిభ



సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్ నైపుణ్యాల పెంపులో భాగంగా ఎల్‌బీ నగర్‌లోని జీడీ గోయెంకా స్కూల్‌లో ఏర్పాటు చేసిన లెర్నోరమస్ టెక్ జనరేషన్ సమ్మర్ క్యాంప్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ శిక్షణలో భాగంగా హైస్కూల్ విద్యార్థులు ఈ–కామర్స్ వెబ్‌సైట్ రూపకల్పన చేసి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జగదీశ్వరి మాట్లాడుతూ., ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థుల కోసం రూపొందించిన ఈ వినూత్న శిబిరంలో కృత్రిమ మేధ(ఏఐ), డిజిటల్ స్టోరీ టెల్లింగ్, జూనియర్ ఫొటోగ్రఫీ, సైన్స్ ప్రయోగాలతో పాటు చదరంగం, నృత్యం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగాల్లో శిక్షణ అందించామన్నారు. శిక్షణ అనంతరం8, 9 తరగతుల విద్యార్థులు ఈ–కామర్స్ వెబ్‌సైట్‌ను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండటం విశేషమన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్ హెడ్ రిచి దస్తాని, లెర్నోరమస్ టెక్ జనరేషన్ నిర్వాహకులు డాక్టర్ పడాల కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



ఆగమయ్యనగర్ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజల ఇబ్బందుల దృష్ట్యా అధికారులు సమన్వయంతో పని చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఆగమయ్యనగర్, గణేష్‌నగర్ కాలనీల్లో బుధవారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, చిన్నపాటి వర్షానికే కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విజయవాడ జాతీయ రహదారి వెడల్పు పనుల దృష్ట్యా ఆగమయ్యనగర్, గణేష్‌నగర్ కాలనీలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, జీహెచ్‌ఎంసీ, జలమండలి, రోడ్లు, భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని, జలమండలి, సివరేజ్ బోర్డు శాఖల్లో నిధుల కొరత ఉందన్నారు. ఆర్ అండ్ బీ అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నిర్దిష్టమైన ప్రణాళికలతో పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీలవాసులు ఆంజనేయులు, యాదయ్య, సతీష్‌కుమార్‌రెడ్డి, వెంకటాచారి, చంద్రశేఖర్, గోవర్ధన్, వెంకటయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

అసలే నీటి ఎద్దడి.. ఆపై వృథా!

- తాగునీరు రోడ్డు పాలు
- లీకేజీలు పట్టించుకోని అధికారులు



విజయపురి కాలనీ ఫేజ్–1లో వాల్వ్ వద్ద లీకవుతున్న మంచినీరు

ఎల్‌బీనగర్: అసలే వేసవి కాలం... ఆపై తీవ్ర నీటి ఎద్దడి... దీనికి తోడు అక్కడక్కడా పైప్‌లైన్ లీకేజీలు వల్ల లోప్రెషర్‌తో నీరు సరఫరా కావడంతో మంచి నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పాలవుతున్నారు. వాటర్ వర్క్స్ అధికారులు నిర్లక్ష్యం కారణంగా తరుచూ వాల్వ్‌ల వద్ద నీరు లీకేజీ అయి ప్రతిరోజూ నీటి సరఫరా వేళలో రోడ్లపై వృథాగా పోతున్నది. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో విజయపురి కాలనీ ఫేజ్–1 వద్ద వాటర్ లీకేజీ అవుతోంది. రోజుల తరబడి నీరు వృథాగా రోడ్ల పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అధికారుల తీరుపై పలువురు మండిపడుతున్నారు. ఈ లీకేజీ వల్ల కాలనీలకు తక్కువ ప్రెషర్‌తో నీరు సరఫరా అవుతోందని పలువురు వాపోతున్నారు. ఇలా రోజంతా నీరు రోడ్ల పాలవడం వల్ల రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. అసలే అరకొరగా సరఫరా చేస్తున్న నీరు ఏమాత్రం సరిపోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వాటర్ వర్క్స్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసి వాటర్ లీకేజీలను అరికట్టి సరఫరాను మెరుగుపర్చాలని పలువురు కోరుతున్నారు.

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి

చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కిస్టోఫర్

మొయినాబాద్‌రూరల్: పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కిస్టోఫర్ పేర్కొన్నారు. బుధవారం హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో వాణిజ్య, వ్యాపార నివారణ విభాగంలో ఎమర్జింగ్ ట్రేడ్స్ ఇన్ మెచిర్యూల్ ఫాండ్స్ విజ్ ఏ ఇన్వెస్టర్స్ పర్సెప్షన్ ఏ సెలక్ట్ స్టడీ అనే అంశంపై డాక్టర్ కె వెంకటజనార్ధన్‌రావు పర్యవేక్షణలో ఆవుల సునీత పరిశోధనను పూర్తి చేశారు. దీంతో ఆమెకు బుధవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ కిష్టఫర్ మాట్లాడుతూ సమాజం అభివృద్ధి వైపు ఉన్నప్పుడే ప్రజల ద్వారా ఈ పరిశోధనలకు గుర్తింపు లభిస్తుందన్నారు. సునీత చేసిన పరిశోధన ప్రస్తుత కాలంలో వాణిజ్యం, వ్యాపార నివారణ, కొనుగోలు, అమ్మకం వంటి విషయానికి సంబంధించిన పరిశోధన ఎంతో బాగుందని ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, జగదీశ్వర్, రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.